AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

స్కూళ్లలో బతుకమ్మ సంబరం



2



2

అగ్నిప్రమాదంలో గాయపడ్డ తండ్రీ కొడుకులు మృతి

స.హ. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

అక్షరటుడే, ఇందూరు: సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సూచించారు. స.హ. చట్టం వారోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులు ఎల్‌సీడీ స్క్రీన్‌పై తిలకించారు. చట్టం అమలు ఆవశ్యకతపై రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, ఇతర అతిథుల ప్రసంగాలను ఆలకించారు. ఆర్టీఐ అమలుపై చేయించిన ప్రతిజ్ఞలో అన్ని శాఖల పీఐవోలు, ఏపీఐవోలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి గీత, కలెక్టరేట్ ఏవో బాలరాజు, అధికారులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ ఎన్నికలు..

అక్షరటుడే, కామారెడ్డి: తెలంగాణ ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ నిజామాబాద్, కామారెడ్డిలలో ప్రశాంతంగా జరిగాయి. గురువారం ఉదయం 5 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం వరకు పోలింగ్ సాగింది. మరోవైపు విధుల్లో ఉండి ఓటు వేయలేని కార్మికులకు బ్యాలెట్ ద్వారా 14, 15 తేదీలలో ఓటుహక్కు అవకాశం కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో డిపో వద్ద సందడి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు జరుగకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఎంప్లాయీస్ యూనియన్, టీఎంయూ, ఎన్ఎంయూ ఒక కూటమి కాగా.. టీడబ్ల్యూయూ, బీఎంఎస్, టీజేఎంయూ మరో కూటమిగా పోటీ చేశాయి.



కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలి

అక్షరటుడే,మెండోరా: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషనర్ బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 13 కోట్లకు పైగా, తెలంగాణలో సుమారు 90 లక్షల ఓట్లు తొలగించారని పేర్కొంటూ, ఓటర్ల జాబితా వ్యవహారంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నేపథ్యంలో వారిని అరెస్టు చేయడం బాధాకరమని నగేష్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ జిల్లా పీసీసీ ఆదేశాల మేరకు మండల కేంద్రాల్లో ధర్నాలు, దిష్టిబొమ్మల దహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్ల నరేష్, కౌడప్ శరత్, వెంకట్ రామ్ రెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, మెండోరా మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం రెడ్డి, ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, పార్టీ మండలాధ్యక్షులు సాయిరెడ్డి, శ్రీకాంత్, మెండోరా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, సోం రాజేందర్, నోముల రాజన్న, నాయకులు నోముల శ్రీనివాస్, గణేష్, బద్దం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లాలో భారీ భూ స్కాం ఒకటి వెలుగు చూసింది. ఏకంగా 22A జాబితాలో ఉన్న ప్రోహిబిటేడ్ భూమికి అధికారులు రిజిస్ట్రేషన్ చేసి పెట్టారు. ఈ భూమి విలువ సుమారు రూ.6 కోట్ల పైచిలుకు ఉండడం గమనార్హం.

- అక్షరటుడే, నిజామాబాద్



జిల్లాలో భూరీ భూ స్కాం..

■ 22Aలో ఉన్న భూమికి దర్జాగా రిజిస్ట్రేషన్
■ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బాగోతం ■ అర్సపల్లి శివారులో రూ.కోట్లల్లో భూమి అక్రమార్కుల చేతుల్లోకి..

నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో గత నెల ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగింది. కాగా.. ఈ భూమి పూర్తిగా నిషేధిత జాబితాలో ఉంది. ఫారెస్ట్ భూమికి ఆనుకుని ఉన్న ఈ ప్రభుత్వ స్థలాన్ని కొందరు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అంతేకాదు అడ్డదారిలో తమ పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేసి పెట్టారు.

అర్సపల్లి శివారులో..

నిజామాబాద్ నార్త్ మండలం పరిధిలోని అర్సపల్లి శివారు సర్వే నంబరు 249 పూర్తిగా గవర్నమెంట్ ల్యాండ్. ఈ భూమికి సంబంధించి ఎవరికీ ఎలాంటి హక్కులు లేవు. ఒకవేళ అసైన్డ్ హక్కులు కల్పించినా రిజిస్ట్రేషన్ వీలుకాదు. అధికారులకు కూడా ఈ అధికారం లేదు. కానీ, ఇవన్నీ పక్కనబెట్టి నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారి గత నెల అంటే సెప్టెంబరులో డాక్యుమెంట్ పూర్తి చేశారు. డాక్యుమెంట్‌లో మొత్తం 6,666 గజాలు దాదాపు ఎకరంన్నర భూమికి ఎలాంటి పరిశీలన చేయకుండా రిజిస్ట్రేషన్ చేసి పెట్టడం గమనార్హం. ఈ భూమి సర్వే నంబరు 249/1 కాగా.. ఇది పూర్తిగా ప్రొహిబిటెడ్ లిస్టులో ఉంది.

కబ్జా వ్యవహారంపై ఫిర్యాదు

ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ కబ్జా వ్యవహారంపై గత నెల 24న ఓ వ్యక్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కోట్లాది రూపాయలు విలువ చేసే గవర్నమెంట్ ల్యాండ్‌ను కబ్జా చేయడమే కాకుండా తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ ఆఫీసులో ఇచ్చిన ఈ ఫిర్యాదు కాపీని అక్కడి సిబ్బంది తొక్కిపెట్టినట్లు తెలుస్తోంది.
ఏళ్లుగా డీఐజీ కార్యాలయంలో పాతుకు పోయిన ఉద్యోగి ఒకరు ఈ విషయం బయటకు రాకుండా మేనేజ్ చేసే పనిలో ఉన్నట్లు సమాచారం. అసలు వృత్తిని పదిలేసి సొంత వ్యాపకాలకు పరిమిత మైన ఈ స్వామి.. ఇప్పుడు ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం సైతం బయటకు రాకుండా అన్నీ తానై మేనేజ్ చేయడం వెనుక రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఇక.. ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేస్తే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. మరోవైపు ఈ విషయమై జిల్లా కలెక్టర్ విచారణ చేయించాల్సి ఉంది. ప్రభుత్వ భూముల కబ్జా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా ఉంది. కానీ, కిందిస్థాయి అధికారులు ఈ 22A జాబితాను సైతం లెక్కచేయకుండా ఇలా అక్రమాలకు పాల్పడటం గమనార్హం.

ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి..

అక్రమార్కులు ఇంతటితో ఆగలేదు. ఈ భూమిని తమ సొంతం చేసుకునేందుకు ఏకంగా ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించారు. ఫేక్ పట్టా, నకిలీ నాలా పత్రం సమర్పించారు. డాక్యుమెంట్ వచ్చిందే అదునుగా ఎలాంటి వెరిఫై చేయకుండానే అర్బన్ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో లక్షలు చేతులు మారినట్లు కోడై కూస్తోంది.

రైతుల ప్రయోజనాల కోసమే భూముల రీసర్వే: కలెక్టర్ ఇలా త్రిపాఠి

అక్షరటుడే, బోధన్: రైతులు, భూ యజమానులకు భవిష్యత్తులో ఎలాంటి భూ సమస్యలు రావొద్దనే ఉద్దేశంతోనే భూముల రీసర్వే చేయిస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సాలూర మండలం ఫతేపూర్‌లో భూముల రీసర్వేను శుక్రవారం అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, రోవర్ సహాయంతో సర్వే నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను వివరాలు అడిగి



తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున 30 ఎకరాల చొప్పున సర్వేను నిర్వ హిస్తూ, వేగవంతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే, తమ దృష్టికి తేవాలన్నారు. సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలో సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. భూమి హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాలూర మండలంలో తొలివిడతగా మూడు గ్రామాల్లో భూముల రీసర్వే జరుగుతోందని పాలనాధికారి వెల్లడించారు.

రైతులకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలి

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్(పిట్లం): రైతులకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే డిమాండ్ చేశారు. పిట్లంలోని అంబేద్కర్ చౌరస్తాలో తలపెట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి విద్యుత్ ఎంతో కీలకమన్నారు. సరైన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోతే రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సాగునీటి అవసరాలకు అనుగుణంగా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంద ని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, రైతులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు.





అమ్మవారికి సేవ చేయడం అదృష్టం

అక్షరటుడే, ఇందూరు: దుర్గామాతకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని ధన్‌పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్లు ఉదయ్ కుమార్, ప్రణయ్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని మిర్చి కంపౌండ్‌లో గల డీఎస్ఎన్ కార్యాలయంలో అమ్మవారి మండప నిర్వాహకులకు ట్రస్టు ఆధ్వర్యంలో పట్టు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా గత పదేళ్లుగా అమ్మవారి మండపాలకు పట్టుచీరలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నియమ నిబంధనలతో నవరాత్రులను జరుపుకోవాలన్నారు. హిందూ పండుగల్లో అమ్మవారి నవరాత్రులకు ఎంతో ప్రత్యేకత ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మఠం పవన్, బంటు రాము, మల్కాయి మహేందర్, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి మురళి, ధాత్రిక పరమేశ్వర్, నాయకులు పవన్, మారావార్ కృష్ణ పాల్గొన్నారు.



నవోదయ ప్రవేశాలకు వారం రోజులే గడువు..

అక్షరటుడే, ఎల్లారెడ్డి: నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు గడువు వారం రోజులే ఉందని నిజాంసాగర్ విద్యాలయ ప్రిన్సిపాల్ రాంబాబు తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. 2027-2028 విద్యాసంవత్సరానికి గాను 9,11, తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి గాను ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. దీని కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ 15వ తేదీన ముగుస్తున్నట్లు వివరించారు. అర్హులైన విద్యార్థులు చివరి తేదీలోపు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన కోరారు.

దివ్యాంగుడికి బ్యాటరీ సైకిల్ అందజేత



అక్షరటుడే, కామారెడ్డి: ప్రజావాణిలో వచ్చిన దివ్యాంగుడి విజ్ఞప్తికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వెంటనే స్పందించారు. రోజువారీ పనుల నిమిత్తం తిరిగేందుకు బ్యాటరీ వీల్ చైర్ అందజేశారు. బిచ్కుంద మండలానికి చెందిన గండమల్ల గంగాధర్ సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిశారు. తాను దివ్యాంగుడినని, నిత్య అవసరాలకు, జీవనోపాధికి బయటకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, బ్యాటరీ వాహనం అందించాలని కోరారు. ఆయన పరిస్థితిని సానుభూతితో పరిశీలించిన కలెక్టర్ వెంటనే స్పందించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ వద్ద గంగాధర్‌ను పిలిపించి బ్యాటరీ వీల్ చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని అర్హులకు అవసరమైన సహాయం అందించేందుకు యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వై గిరి, డీడబ్ల్యూవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్నేహా సొసైటీ అండగా నిలవడం అభినందనీయం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: మానసిక దివ్యాంగులకు స్నేహా సొసైటీ అండగా నిలవడం అభినందనీయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ముద్దసాని నీలిమ అన్నారు. నగరంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ.. దివ్యాంగులను పెంచడం కష్టంగా భావించొద్దన్నారు. అలాంటి వారికి స్నేహా సొసైటీ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అనిర్వచనీయమన్నారు. మానసిక ఆరోగ్యంపై సమాజంలో అవగాహన లేని రోజుల్లో ఒక మానసిక వికలాంగుల పాఠశాల ఏర్పాటు చేయాలంటే సిద్దయ్య జ్యోతిలు ఎంతో శ్రమపడి ఉంటారన్నారు. వారి శ్రమకు ఫలితమే నేడు అనేకమంది దివ్యాంగులు విద్యను ఇతర సేవలను అందుకోగలుగుతున్నారు. మెడికల్ కళాశాల మానసిక వైద్యశాఖాధిపతి డాక్టర్ విశాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ దివ్యాంగ బాలలను చిన్న వయసులోనే గుర్తిస్తే వారి వైకల్యాన్ని తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య ఉపసంచాలకులు పురుషోత్తమ నాయక్, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇన్నమూరి రవితేజ, స్నేహ సొసైటీ కార్యదర్శి, అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, టాటా ఇన్సూరెన్స్ మేనేజర్ సాయిరాం, రాజశ్రీ, బాలాజీ, సత్యనారాయణమూర్తి, సుమన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



అక్షరటుడే, భీమ్‌గల్: మండలంలోని బడాభీమ్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 95 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ విష్ణువర్ధిని, వార్డు సభ్యులు సుమన్ రాజ్ కుమార్ అరుణ్, పంచాయతీ కార్యదర్శి రాహుల్, హెచ్ఎం కృష్ణస్వామిలతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల వంటి సంక్షేమ ఫలాలను ప్రభుత్వం సకాలంలో అందిస్తోందని తెలిపారు. పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలు ఎంతో ఊరటనిస్తున్నాయని హెచ్ఎం కృష్ణస్వామి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శంకర్ గౌడ్, వార్డు సభ్యులు సుమన్, అరుణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మహాప్రస్థానం డీపీఆర్ ప్రజెంటేషన్ కోసం అనుమతివ్వండి



అక్షరటుడే, కామారెడ్డి: పట్టణంలో హౌజింగ్ బోర్డు సమీపంలో హిందూ శ్మశాన వాటికలో డీపీఆర్ ప్రజెంటేషన్ కోసం అనుమతివ్వాలని ఎస్ఎఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. ఫౌండేషన్ ఛైర్మన్ సుభాష్‌రెడ్డి రాసిన లేఖను ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణిని కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణ ప్రజలందరికీ అంతిమ సంస్కారాలు గౌరవప్రదంగా, పరిశుభ్రంగా, సకల సౌకర్యాలతో నిర్వహించేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్, ఆర్కిటెక్చరల్ ప్లాన్, ఆడియో విజువల్ ప్రెజెంటేషన్ ను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

భీమ్‌గల్ మండల అభివృద్ధికి శరవేగంగా అడుగులు..



అక్షరటుడే, భీమ్‌గల్: భీమ్‌గల్ మండల అభివృద్ధి, పరిపాలనా సౌకర్యాల మెరుగుదలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక చొరవ, ఆదేశాలతో భీమ్‌గల్ మండలంలో నూతన తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 2.25 కోట్లు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.75 కోట్లు రూ. 4 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండల నాయకులు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా, కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న పాత తహశీల్దార్ కార్యాలయాన్ని కూల్చివేసి, ఊరికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో చెక్‌డ్యామ్ వద్ద ఉన్న ఎస్సీ హాస్టల్‌కు తరలించారని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, బొదిరే నాగమణి స్వామి, సంటి లతా, జేజే నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, గోపాల్ నాయక్, సుంకరి సురేష్, మేకల శ్రీనివాసు, భూక్య రవి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



బోధన్‌లోని ఇందూరు హైస్కూల్‌లో ..





ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో

స్కూళ్లలో బతుకమ్మ సంబరం

తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలు ఉమ్మడి జిల్లాలో ప్రారంభ మయ్యాయి. పాఠశాలలకు శనివారం నుంచి సెలవులు ఉండడంతో ముందస్తుగానే బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, మహిళా టీచర్లు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ ఆడిపాడారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



ఆర్మూర్ స్టైల్స్ పాఠశాలలో..



భీమ్‌గల్ పాఠశాలలో ..



ఆలూర్ స్కూల్‌లో..



పోతంగల్ హైస్కూల్‌లో..



మెండోరాలో సైబర్‌నేరాలపై అవగాహన

అక్షరటుడే, మెండోరా: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మెండోరా పోలీసులు సూచించారు. శుక్రవారం మెండోరా ప్రధాన రహదారి వద్ద సైబర్ సేఫ్టీ, జాతీయ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని వెల్లడించవద్దని తెలిపారు. అనుమానాస్పద సందేశాలు, లింకులపై క్లిక్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 సైబర్ క్రైం హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా ఆన్‌లైన్ మోసాలను అరికట్టవచ్చని పోలీసులు పేర్కొన్నారు.



గుజ్జ సత్యంకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి

అక్షరటుడే, కామారెడ్డి: గవర్నర్ కోటాలో సామాజిక సేవకుడు గుజ్జ సత్యంకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. కామారెడ్డి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బెక్కో స్కూల్, హోమియో ద్వారా ప్రజలకు సేవలను అందిస్తున్న సత్యంకు ఈసారి బీసీల తరపున ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలన్నారు. బీసీల సంక్షేమం కోసం ఆయన జాతీయస్థాయిలో ఉద్యమాలు చేస్తున్నారని, ప్రతినిత్యం బీసీల మంచి కోరుకునే వ్యక్తి అని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజల మనిషిగా పేరున్న సత్యంను మండలికి పంపిస్తే బీసీలకు మేలు జరుగుతుందన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బట్టు వెంకట రాములు, వెంకన్న, రాజేందర్, దినేష్, సంగాగౌడ్, పెంటయ్య, లింగమయ్య, సురేందర్, మహమ్మద్ ఖాసీం, భూపతి, రాజు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో అస్తవ్యస్తంగా పార్కింగ్..



అక్షరటుడే, కోటగిరి : పోతంగల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో పార్కింగ్ అస్తవ్యస్తంగా మారింది. ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్లేందుకు ఉన్న డోర్ వద్దే వాహనాలు నిలిపి ఉంచుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కార్యాలయానికి బయట పార్కింగ్ ఉన్నప్పటికీ కొంతమంది అధికారులు, సిబ్బంది తమ వాహనాలను ఎంట్రెన్స్ వద్దే నిలుపుతున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.



మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలో స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మెడికవర్ ఆస్పత్రికి చెందిన కార్డియాలజిస్ట్ జగదీష్ చంద్రబోస్, జనరల్ ఫిజీషియన్ మాలు ఆనంద్ నందకిషోర్, ఆర్థోపెడిక్ సర్జన్ దీపక్ సుమారు 100 మంది రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలపై తగిన సలహాలు, సూచనలు అందించారు. విరమణ పొందిన ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

నూతన మసీదు కమిటీ సభ్యులకు సన్మానం



అక్షరటుడే, పోచంపాడ్: పోచంపాడ్ మసీదు నూతన సదర్‌గా అజీజ్ ఎన్నికయ్యారు. దీంతో ఆయనను కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ కిరణ్, నూతన సదర్ అజీజ్‌తో పాటు మసీదు కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సదర్‌తో పాటు కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. గ్రామంలో మతసామరస్యం, ఐక్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రమేష్, చందు, సంతోష్, అర్జున్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గాయపడ్డ తండ్రీ కొడుకులు మృతి



అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: నగరంలో విషాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పంటుకోగా గాయపడ్డ తండ్రీకొడుకులు ఇద్దరు మృతి చెందారు. నగరంలోని పూలాంగ్ సమీపంలో గల హనుమాన్ నగర్‌లో గతనెల 26న తెల్లవారు జామున ఫజల్‌ఖాన్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెల రేగాయి. వెంటనే మంటలు ఇల్లంతా వ్యాపించాయి. ఈ క్రమంలో తండ్రి ఫజల్‌ఖాన్, కొడుకు షాజ్‌ఖాన్ ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. ఫజల్ ఖాన్ చికిత్స పొందుతూ మరణించగా.. షాజ్‌ఖాన్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆయన చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందారు. అగ్నిప్రమాద ఘటనలో తండ్రీకొడుకులు మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

నందిపేటలో ఘనంగా రతన్ టాటా వర్ధంతి

అక్షరటుడే, నందిపేట్: మండల కేంద్రంలో వ్యాపార దిగ్గజం దివంగత రతన్ టాటా వర్ధంతిని టాటా లైఫ్ ఇన్సూరెన్స్ నందిపేట బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ వ్యాపారంతో వచ్చే లాభాలతో పాటు సమాజసేవలోనూ సంతృప్తి దొరుకుతుందని నిరూపించిన మహోన్నతుడు రతన్ టాటా అని కొనియాడారు. ఎందరో యువతకు ఆయన స్ఫూర్తిప్రదాతగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ లీడర్లు రవీందర్, మల్లేష్, మాధవ్, సాగర్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం

అక్షరటుడే, ముప్కాల్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా బాలికల జట్టు సిద్ధమైందని కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. భద్రాద్రి కొత్తగూడెంలోని అశ్వరావుపేటలో జరిగే అండర్ 20 జూనియర్ బాలికల ఇంటర్ డిస్టిక్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు బాలికల జట్టు శుక్రవారం సాయంత్రం బయలుదేరి వెళుతున్నట్లు ఆయన వివరించారు. జట్టుకు కోచ్‌గా డి.తేజస్విని, మేనేజర్‌గా జి.పద్మావతి వ్యవహరిస్తున్నారు. క్రీడాకారుల రవాణా ఖర్చులకు ఏర్పట్ల వాస్తవ్యులు రమేష్ గౌడ్ రూ.3 వేలను అందజేశారని వివరించారు. కార్యక్రమంలో ముప్కాల్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలేటి విజయ్, పీడీ రాజ్ కుమార్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి దినేష్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు గడ్డం రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

